



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

కాంగ్రెస్ మద్దతుదారులే ఏకగ్రీవం

- మాచారెడ్డి మండలంలో నాలుగు గ్రామ పంచాయతీల్లో ఒకే నామినేషన్ దాఖలు
- కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధే మా మద్దతుదారుల గెలుపునకు పునాది
- ఎమ్మెల్సీ కవిత, స్థానిక ఎమ్మెల్యే కలిసి వస్తే అభివృద్ధి చేసుకుందాం
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మద్దతుదారులే ఏకగ్రీవమవుతున్నారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాచారెడ్డి మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీల్లో ఒకే నామినేషన్ దాఖలు అయిందని మండలంలోని వెనుక తండాలో కేలోత్ పద్మ, ఎల్లంపేటలో మారుపక అంజమ్మ, అంకిరెడ్డి తండాలో బోనోత్ శ్రీరాం, బోడగుట్ట తండాలో మలోత్ సంతోష్‌లు కాంగ్రెస్ పార్టీ మద్దతు పలికిన వారేనని తెలిపారు. పలుచోట్ల ప్రతిపక్షాలకు అభ్యర్థులు కరువయ్యారని ఈ ఏకగ్రీవలే నిదర్శనమని తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గంలో దాదాపు 80 శాతం స్థానాలను కాంగ్రెస్ మద్దతుదారులు కైవసం చేసుకుంటారని అన్నారు. రాష్ట్రంలో సర్పంచ్ పదవులకు ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం రూ.10లక్షలు అందిస్తుందని తెలిపారు. అదే విధంగా ఎస్‌డీఎఫ్, ఎంపీ నిధుల నుంచి మరో రూ.10లక్షలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, ఉచిత బస్సు ప్రయాణం లాంటి వాటితో పాటు రైతులకు (మిగతా 8లో..)

గ్లోబల్ ఎడ్యుకేషన్ ఆఫ్ ఎక్సలెన్స్ టీచర్ అవార్డుకు

జిల్లా వాసి ఎంపిక

- అవార్డు అందుకున్న చిన్నమల్లారెడ్డి టీచర్ రామకృష్ణ



కామారెడ్డి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల గణితశాస్త్ర ఉపాధ్యాయుడు విజయగిరి రామకృష్ణ గ్లోబల్ ఎడ్యుకేషన్ ఆఫ్ ఎక్సలెన్స్ టీచర్ 2025, పీఎంశ్రీ అవార్డులకు ఎంపికయ్యారు. ఏకేఎస్ ఇంటర్నేషన్ ఎడ్యుకేషన్ వారు ఈ గ్లోబల్ టీచర్ అవార్డును ప్రపంచ స్థాయి విద్యలో అత్యున్నత సేవలు అందిస్తున్న 80కి పైగా దేశాల ఉపాధ్యాయులను గుర్తించారు. శనివారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ వేదికపై సన్మాన కార్యక్రమంలో రామకృష్ణను సన్మానించారు. కింది స్థాయి నుంచి గ్లోబల్‌స్థాయికి పాఠశాల విద్యను బలోపేతం చేసే ఉద్దేశ్యంతో ప్రపంచ వ్యాప్తంగా నైపుణ్యం కలిగి, పోటీ పరీక్షల్లో ఒలంపియాడ్ పరీక్షల్లో తట్టుకునేలా విద్యార్థులను పాఠశాల స్థాయి నుంచి తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను గుర్తించి గ్లోబల్ ఎక్సలెన్స్ టీచర్ అవార్డుల ద్వారా ఆ సంస్థ ప్రోత్సహిస్తోంది. ప్రతిష్ఠాత్మకమైన ఈ అవార్డును పొందిన రామకృష్ణను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లాలోని పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ స్థానాలను ఏకగ్రీవం చేసేందుకు స్థానిక ఎమ్మెల్యేలు దృష్టి సారించారు. ముఖ్యంగా కామారెడ్డిలో షబ్బీర్‌అలీ, ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే మదన్‌మోహన్ ముందు వరుసలతో ఉన్నారు. కాగా ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు రూ. 30 లక్షల నిధులు అందజేయనున్నట్లు తెలిపారు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసుకోవచ్చనే ఆశను గ్రామస్థులకు కల్పించారు. దీంతో ఏకగ్రీవాల వైపు అడుగులు పడుతున్నాయి. మొదటి విడత నామినేషన్లలో కొన్ని గ్రామ పంచాయతీలకు సింగిల్ డిజిట్ సంఖ్యలో నామినేషన్లు పడ్డాయి. మిగతా రెండు, మూడు విడతల నామినేషన్లు దాఖలయ్యే సమయానికి ఏకగ్రీవం దిశగా ఎన్ని పంచాయతీలు అడుగులు వేయనున్నాయో వేచి చూడాలి.




ఏకగ్రీవాలపై.. నాయకుల దృష్టి



- ఏకగ్రీవాల దిశగా పలు గ్రామ పంచాయతీలు
- పలు సర్పంచ్ స్థానాలకు సింగిల్ నామినేషన్లు
- ఏకగ్రీవాలపై దృష్టి సారించిన స్థానిక ఎమ్మెల్యేలు
- ముగిసిన మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ
- 167 సర్పంచ్ స్థానాలకు 1,292 నామినేషన్లు
- 1,520 వార్డు స్థానాలకు 3,802 నామినేషన్లు
- నేడు రెండో విడత నోటిఫికేషన్.. మొదలు కానున్న నామినేషన్ల పర్వం

కామారెడ్డి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు పంచాయతీల్లో ఏకగ్రీవాలపై ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. ఇప్పటికే మొదటి విడత నామినేషన్ల ప్రక్రియతో గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. కామారెడ్డి డివిజన్ పరిధిలోని 10 మండలాల్లో మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ శనివారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో పలు పంచాయతీలకు సింగిల్ నామినేషన్లు దాఖలయ్యాయి. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల పరిధిలో మరికొన్ని పంచాయతీలకు ఏకగ్రీవం చేసేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు దృష్టి సారించారు. ఎన్నికలు లేకుండా ఏకగ్రీవమైన గ్రామాలకు ప్రభుత్వం కూడా రూ.30లక్షల నజరాన ఇస్తుందన్న చర్చ సాగుతుండడంతో చాలా చోట్ల ఏకగ్రీవం చేసేందుకు సిద్ధమవుతున్నారు. అయితే ఎన్ని పంచాయతీలు ఏకగ్రీవం అవుతాయో, ఏ మేరకు నిధులు అందుతాయో వేచి చూడాలి.



ఏకగ్రీవ పంచాయతీలకు రూ.30లక్షల నజరానా

పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవమయ్యే ఆయా గ్రామ పంచాయతీలకు రూ.30లక్షల నజరాన ఇస్తామని ఇది వరకే మంత్రులు ప్రకటించారు. అయితే పలు గ్రామ పంచాయతీల్లో ఏకగ్రీవాలు అయ్యేందుకు చూస్తున్నారు. 2019లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలో గత ప్రభుత్వం రూ.10లక్షల నజరాన ఇస్తామని ప్రకటించింది. ఐదేళ్లు పూర్తయిన ఆ పంచాయతీలకు నాయ పైసా (మిగతా 8లో..)

యథావిధిగా ప్రజావాణి

కామారెడ్డి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి యదావిగా కొనసాగుతుందని కలెక్టర్ ఆశీష‌సాంగ్వాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్‌లోని రూమ్ నంబరు 25లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణతో పాటు ప్రజల సమస్యలను కూడా సమర్థవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు.



తీరు మారదు.. దారి మార్చరు

- అర్ధాంతరంగా మోర్తాడ్- చౌట్‌పల్లి రోడ్డు విస్తరణ పనులు
- మూడేళ్లుగా ప్రయాణికులకు అవస్థలు

6

వణికించే చలిలో పంచాయతీ వేడి

- పొద్దుగాళ్ల నుంచే వీధుల్లో నేతల పర్యటన
- గ్రామాల్లో ఎలచ్చన్ల సందడి

7



రూ.50వేలు దాటితే సీజ్

- అమలులోకి వచ్చిన ఎలక్షన్ కోడ్
- తనిఖీలను ముమ్మరం చేసిన పోలీసులు

7

చివరి రోజు నామినేషన్ల హడావిడి

- కామారెడ్డి మండలంలో రాత్రి వరకు కొనసాగిన నామినేషన్ల ప్రక్రియ
- 5 గంటల వరకు కేంద్రాల లోపల ఉన్న వారికి టోకెన్లు ఇచ్చిన అధికారులు



గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వేచి ఉన్న గ్రామస్థులు

కామారెడ్డి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ కామారెడ్డి మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు స్వీకరించిన నామినేషన్ల ప్రక్రియ శనివారంతో ముగిసింది. మండలంలో నామినేషన్ల ప్రక్రియ రాత్రి వరకు కొనసాగింది. వాస్తవానికి సాయంత్రం 5 గంటల వరకు ప్రక్రియ ముగియాల్సి ఉండగా అధికారులు ఉదయం నుంచి నామినేషన్లతో అభ్యర్థులు ఎక్కువగా రావడంతో నిర్ణీత సమయంలో లోపు దరఖాస్తుల స్వీకరణ జరగదని భావించి టోకెన్ సిస్టాన్ని తీసుకువచ్చారు. 5 గంటల లోపల ఉన్న ఐదు నామినేషన్ కేంద్రాలైన గర్గుల్‌లో 10, క్యాసంపల్లిలో 52, చిన్నమల్లారెడ్డిలో 21, నర్సన్నపల్లిలో 36, శాబ్దిపూర్‌లో 30మంది నామినేషన్ అభ్యర్థులకు టోకెట్లు అందించి నామినేషన్లను స్వీకరించారు. అయితే గత మూడు రోజుల పాటు నామినేషన్ల స్వీకరిస్తుండగా మొదటి రోజు తక్కువగా రాగా, రెండవ రోజు అష్టమి ఉండడంతో అంతంత మాత్రంగానే దరఖాస్తులు చేసుకున్నారు. శనివారం మాత్రం పెద్ద సంఖ్యలో నామినేషన్ కేంద్రాలకు వచ్చారు. నామినేషన్ల ప్రక్రియ రాత్రి వరకు కొనసాగిందని అధికారులు పేర్కొన్నారు.



మెంగారం శివారులో

చిరుత సంచారం

లింగంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెంగారం శివారులో చిరుత పులి సంచరిస్తుండడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గ్రామ శివారులోని ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారి పక్కన అటవీ ప్రాంతం నుంచి రోడ్డు దాటేందుకు సిద్ధంగా ఉన్న చిరుతను శుక్రవారం రాత్రి గస్తీ తిరుగుతున్న పోలీసులు గమనించి ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది. చిరుత సంచరిస్తుందన్న సమాచారం తెలుసుకున్న సమీప గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారిపై నిత్యం వేలాది మంది వాహనదారులు ప్రయాణిస్తుంటారు. గత నెలలో కంచుమల్ శివారులోనూ చిరుత రోడ్డుకు సమీపంలో కనిపించడంతో వాహనదారులు రాత్రి వేళ వాహనాల్లో ప్రయాణించాలంటే భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు చిరుతను బంధించి జూపార్క్‌కు తరలించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. సమీప అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నందున సమీప గ్రామాల ప్రజలు రాత్రి వేళల్లో అడవుల్లోకి వెళ్లవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్దన్

ప్రత్యేక రాష్ట్రం కోసం

ప్రాణాలను ఫణంగా పెట్టిన నేత కేసీఆర్

- మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

కామారెడ్డి టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడి ప్రతీ పల్లెను, పట్టణాన్ని కదిలించిన నేత కేసీఆర్ అని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్దన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కేవీఎస్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ దీక్షా దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకుముందు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దీన్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల పోరాటం చేసి కేంద్రం మెడల్ వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహా నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో రెండు సార్లు అధికారంలోకి వచ్చి ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టడంతో పాటు అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపాడని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల ద్వారా లక్షలాది ఎకరాలు సస్యశ్యామలంగా మారాయని తెలిపారు. అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తుందన్నారు. మళ్లీ బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తీసుకువచ్చి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేసే వరకు ప్రతీ కార్యకర్త కష్టపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్ షిండే, సురేందర్, పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ రవియాదవ్, మాజీ కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.



చిన్నమల్లారెడ్డిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

ధాన్యం కొనుగోళ్లను

వేగవంతం చేయాలి

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి రైస్‌మిల్లులకు వేగవంతంగా తరలించాలని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ తెలిపారు. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో శనివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. తేమ శాతం ఏ విధంగా నమోదు చేస్తున్నారనే దానిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో అవసరమైన టార్పాలిన్ షీట్లు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. అదేవిధంగా రోజు వారీగా ఎన్ని క్వింటాళ్ల వరి ధాన్యం లోడింగ్ జరుగుతుందనే దానిపై పర్యవేక్షణ జరపాలని ఐకేపీ సిబ్బందిని ఆదేశించారు. వరి కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఎం శ్రీకాంత్, మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి, ఏవో పవన్, ఏఈవో శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై

దాడులను అరికట్టాలి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి వరప్రసాద్

కామారెడ్డి టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ అరికట్టాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి వరప్రసాద్ అన్నారు. శనివారం వుమెన్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళలపై హింస నిర్మూలన దినోత్సవ అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలపై హింస నిర్మూలన కోసం ప్రతీ కుటుంబం, ప్రతి సంస్థ, సమాజం మొత్తం బాధ్యతతో ముందుకు రావాలని, హింసకు గురైన ప్రతీ మహిళ న్యాయ సహాయం పొందేలా న్యాయ సేవా సంస్థలు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటాయని తెలిపారు. చట్టపరమైన రక్షణతో పాటు సామాజిక అవగాహన పెరిగినప్పుడే మహిళలపై హింస పూర్తిగా తగ్గుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి, న్యాయాధికారులు సుమలత, సుధాకర్, దీక్ష, వార్డ్ మానిటరింగ్ కో ఆర్డినేటర్ రాణి, రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేష్, డీడబ్ల్యువో ప్రమీల, సూపరింటెండెంట్ అరుణ్ భాస్కర్, పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్ తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి వరప్రసాద్

ఎన్నికల కిక్కు



- పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జోష్
- ఎన్నికలు పూర్తయ్యే వరకు మద్యంకు ఫుల్ డిమాండ్
- జిల్లాలో 49 మద్యం దుకాణాలు
- రేపటి నుంచి కొత్త మద్యం షాపులు ప్రారంభం
- కొత్త మద్యం వ్యాపారులకు కలిసి రానున్న ఎన్నికలు

కామారెడ్డి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొత్త మద్యం దుకాణాలకు స్థానిక పంచాయతీ ఎన్నికలు కిక్ కలిసొచ్చింది. చివరి లక్కీ డ్రాప్స్ అమ్మకాల వేటలో పాత వారు ఉన్నారు. మద్యం దుకాణాల ఓపెన్‌తో బారీ బోణి కొట్టాలని కొత్త యజమానులు ఆశ పడుతున్నారు. ఈ నెల 25న పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగా డిసెంబరు 17 వరకు జిల్లాలో ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. డిసెంబరు 1 నుంచి కొత్త లిక్కర్ షాపులు తెరుచుకోనున్నాయి. కొత్త వారికి ఆబ్కారి శాఖ మద్యం కేటాయించింది.

జిల్లాలో 49 మద్యం దుకాణాలు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ల పరిధిలో 49 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఈ లైసెన్స్‌లకు గత నెల 27న లక్కీడ్రా నిర్వహించారు. సోమవారం నుంచి (మిగతా 8లో..)

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నరేష్ (ఫైల్)

రాజంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాయిపల్లి గ్రామానికి చెంది న గజ్జెల నరేష్ గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. శుక్రవారం రాత్రి నరేష్ కామారెడ్డికి వెళ్తుండగా గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్క డే మృతిచెందాడన్నారు. మృతుని తల్లి నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

అక్రమంగా ఇసుక తరలింపు.. ట్రాక్టర్ సీజ్

ముప్కాల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని వన్నెల్ (బి) గ్రామ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై శైలేందర్ తెలిపారు. శనివారం ఉదయం శెట్‌పల్లి గ్రామానికి చెందిన బాబ్బూరి నరేష్ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను వన్నెల్(బి) శివార్లో పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ యజమానితో పాటు అక్రమ రవాణాకు సహకరిస్తున్న గురిజాల నర్సయ్యపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా ఎవరైనా ఇసుక తరలింపు చేపడితే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

తీరు మారదు.. దారి మార్చరు

● అర్ధాంతరంగా మోర్తాడ్- చౌట్‌పల్లి రోడ్డు విస్తరణ పనులు ● మూడేళ్లుగా ఇదే ప్రయాణికులకు అవస్థలు

మోర్తాడ్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల క్రితం ప్రారంభమై న రోడ్డు విస్తరణ పనులు ఆగిపోయాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ అభివృద్ధి పనులపై గ్రామాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ఈ ఎన్నికలు పూర్తయ్యాకనైనా ఈ పనులు పూర్తవుతాయననే నమ్మకంతో ప్రజలు ఉన్నారు.

7 కిలోమీటర్ల మేర..

మోర్తాడ్, వడ్యాట్ మీదుగా చౌట్‌పల్లి వరకు రహదారి విస్తరణ పనులు మూడేళ్ల క్రితం ప్రారంభం కాగా అర్ధంతరంగా నిలిచిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో మోర్తాడ్ నుంచి వడ్యాట్, చౌట్‌పల్లి వరకు 7 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులను పూర్తిచేసేందుకు రూ.6.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కాగా గత ప్రభుత్వ హయాంలో మంత్రిగా పనిచేసిన వేముల ప్రశాంత్‌రెడ్డి అట్టహాసంగా పనులకు శంకుస్థాపన చేశారు. కాగా ఇప్పటివరకు పనులు పూర్తి కాలేదు. రోడ్డుకు ఇరువైపులా కంకర వేశారు. కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు ఆపివేశారు. చేసిన పనులకు బిల్లుల చెల్లింపులు నిలిచిపోవడంతో మధ్యలోనే పనులు ఆపివేశారని గ్రామస్థులు అంటున్నారు. దీంతో అధికారులు కూడా కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేయలేకపోతున్నారని అంటున్నారు.

అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు

రోడ్డు విస్తరణ పనులు పూర్తి కాకపోవడంతో గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇరువైపులా కంకర వేసి ఉండటంతో వా హనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా నాయకులు, అధి కారులు స్పందించి ప్రజల సౌకర్యం కోసం రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.



మోర్తాడ్- వడ్యాట్ రహదారిపై కంకర వేసి నిలిచిపోయిన పనులు

పనులు వెంటనే పూర్తిచేయాలి



మోర్తాడ్ నుంచి వడ్యాట్ రోడ్డుకు ఇరువైపులా కంకర ఉండడంతో ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతుంది. అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి.

\- గంగుల్ల నవీన్, వడ్యాట్

కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తుంది



సమావేశంలో మాట్లాడుతన్న బీఆర్ఎస్ నాయకులు

భీమ్‌గల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా స్థానిక సంస్థల ఎన్నికలలో రాజకీయ లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ ఇందిరమ్మ చీరలు, మహిళా వడ్డీ రాయితీ రుణాల పేరుతో రాష్ట్ర ప్రజలను మోసం చేస్తుందని భీమ్‌గల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో ఆడపిల్లల పెళ్లిళ్లకు ఇస్తామన్న తులం బంగారం, వృద్ధులకు రూ.4వేల పెన్షన్, వికలాంగులకు రూ.6వేల పెన్షన్, ప్రతి మహిళకు రూ.2500 పెన్షన్, చదువుకునే పిల్లలకు 5 లక్షల విద్య భరోసా ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇవేవి తెలియని కో-ఆపరేటివ్ యూనియన్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. నాయకులు భరత్, నర్సయ్య, ప్రసాద్, నాయక్, మహమ్మద్ ఇక్రమ్, పార్టీ యువ నాయకులు రామ్ చందర్‌గౌడ్, శ్రీనివాస్, రాజు, రామకృష్ణ, దీక్షిత్ పాల్గొన్నారు.

వార్డు రిజర్వేషన్ మార్చారంటూ ఆందోళన



మంగల్‌పాడ్ గ్రామంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ఎడపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలో నామినేషన్ కేంద్రం వద్ద గ్రామానికి చెందిన 3వ వార్డు సభ్యులు, గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. 3వ వార్డు ఎస్సీ రిజర్వేషన్ ఉంటే బీసీ అంటూ నామినేషన్‌ను తిరస్కరించారని ఆరోపించారు. ఈ విషయంపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి విజయ్‌కుమార్ వివరణ ఇస్తూ నామినేషన్ కేంద్రం వద్ద సర్పంచ్, వార్డుసభ్యుల రిజర్వేషన్ల లిస్టును గోడకు అతికించామని, 3వ వార్డు బీసీకి రిజర్వు అయిందన్నారు. అందువల్ల ఎస్సీ అభ్యర్థులు నామినేషన్ వేయగా తిరస్కరించామన్నారు. సోషల్ మీడియాలో వచ్చిన లిస్టు ఆధారంగా వారు ఎస్సీ రిజర్వ్ స్థానం ఉందంటున్నారని తెలియజేశారు. నామినేషన్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తును ఎస్సై రమ ఏర్పాటుచేశారు.

నామినేషన్లను పరిశీలించిన ఎన్నికల అధికారి



వివరాలు తెలుసుకుంటున్న అధికారి

వర్ని, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వర్ని మండలంలో శనివారం రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు జీ.వీ. శ్యాంప్రసాద్ లాల్ పర్యటించారు. మండల కార్యాలయాలతో పాటు ఆయా గ్రామ పంచాయతీలో నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికల నియామక ప్రక్రియను అధికారులకు వివరించారు. తహసీల్దార్ సాయిలు, ఎంపీడీవో వెంకటేశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి పచ్చల నడ్కుడ మల్లన్న జాతర



జాతరకు ముస్తాబైన ఆలయం

వేల్పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చల నడ్కుడ గ్రామంలో ఆదివారం నుంచి జాతర ఉత్సవాలు ప్రారంభించనున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. 3 రోజుల పాటు జరిగే ఉత్సవాలకు వచ్చే భక్తులు, ప్రజల సౌకర్యార్థం వీడీసీ సభ్యులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం గ్రామ రామాలయం నుంచి రథాన్ని జాతర జరిగే కొమురెల్లి మల్లన్న ఆలయం వరకు భక్తులు, ప్రజలు తాళ్ల సాయంతో లాగుతూ తీసుకెళ్తారు. సోమవారం మధ్యాహ్నం జాతర రథోత్సవం నిర్వహిస్తారు. మంగళవారం మల్లన్న స్వామికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



శిక్షణ ఇస్తున్న డీఎల్‌పీవో శివకృష్ణ

ఆర్మూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయితీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్లు అంకిత్, కిరణ్ అన్నారు. ఆర్మూర్ లో శనివారం పంచాయితీ స్టేజ్-1, స్టేజ్ రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు. సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలు చేశారు. శిక్షణ కార్యక్రమంలో డీఎల్‌పీవో శివకృష్ణ అధికారులకు ఎన్నికల సమయంలో చేపట్టవల్సిన విషయాలు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో వివిధ మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, అధికారులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ సందీప్

ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలి

భీమ్‌గల్ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయితీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవడానికి ప్రజలు సహకరించాలని భీమ్‌గల్ ఎస్ఐ సందీప్ సూచించారు. మండలంలోని ముచ్కూర్‌లో శనివారం గ్రామస్థులతో సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకో వాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీవో సంతోష్‌తో కలిసి ముచ్కూర్, పల్లికొండలో పోలింగ్ కేంద్రాలకు సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తొర్లికొండ విద్యార్థి

భీమ్‌గల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బానోత్ రాజు ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు గంగమోహన్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ క్రీడా మైదానంలో ఆదివారం వరకు జరిగే 12వ రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో బనోవత్ రాజు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి రాజును ఎంఈవో శ్రీనివాస్, వ్యాయమ ఉపాధ్యాయుడు గంగమోహన్, వీడీసీ చైర్మన్ ఎర్రోల్ల గంగాధర్, కార్యదర్శి చిక్కాల భూమేశ్వర్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.



రాజు

● రాష్ట్రస్థాయి జూనియర్ వాలీబాల్ పోటీలకు కలిగోట్ పూర్వ విద్యార్థులు వర్షిత్, పూజ, గంగోత్రి, సునాక్షి ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు యాదగిరి శనివారం తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో శనివారం నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి జూనియర్ వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాడు పురుషోత్తమచారి, వ్యాయామ ఉపాధ్యాయుడు యాదగిరి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, విడిసి సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.



ఎంపికైన కలిగోట్ పూర్వ విద్యార్థులు

సీపీఆర్ఎం స్కూల్‌లో సైన్స్ ఫెయిర్



సైన్స్ ఫెయిర్ ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఆలూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుత్ప సీపీఆర్ఎం స్కూల్‌లో శనివారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఇందులో భాగంగా 130 స్టాల్స్‌ను సుమారు 500 మంది విద్యార్థులు నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆలూర్ ఎంఈవో నరేందర్ హాజరై విద్యార్థిని, విద్యార్థులను అభినందంచారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రాస నిత్యానందం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

3వ రోజు నామినేషన్ కేంద్రాల వద్ద సందడి

» సాయంత్రం 5 దాటిన చాలా మంది గేటు లోపలే

బోధన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బోధన్ డివిజన్‌లో మూడవ రోజు ఎన్నికల నామినేషన్ల పర్వం ఊపందుకుంది. రెండవ రోజు అష్టమి కావడంతో సర్పంచ్, వార్డు సభ్యులకు నామినేషన్ వేయడానికి కొంతమంది వెనుకంజ వేశారు. మూడో రోజు శనివారం నవమి కావడంతో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ కేంద్రంలో బారులు తీరారు. ఉదయం నుండే నామినేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థులతో సందడి నెలకొంది. సాయంత్రం 5 దాటినా చాలా మంది సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యుల అభ్యర్థులు లోపలే బారులు తీరారు. సమయానికి లోపలికి వచ్చిన వారందరి నామినేషన్‌లు స్వీకరిస్తామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. రాత్రి అవుతున్నప్పటికీ నామినేషన్‌ల పర్వం కొనసాగుతూనే ఉంది.

పోలీసుల బందోబస్తు

నామినేషన్‌ల ముగింపు సందర్భంగా కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఎలక్షన్ కమిషన్ నిబంధన మేరకు సమయానుగుణంగా నామినేషన్‌ల వద్ద గేట్లను మూసి వేశారు. అభ్యర్థులు పూర్తి స్థాయిలో నామినేషన్ కేంద్రాల వద్దకు వచ్చారు. అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్‌లు వేశారు. శనివారం చివరి రోజు కావడంతో అభ్యర్థులు భారీ సంఖ్యలో నామినేషన్ కేంద్రాలకు తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



సాలూర నామినేషన్ సెంటర్ వద్ద అభ్యర్థుల సందడి

వరి కొయ్యల అవశేషాలు కాల్చడం వల్ల అపార నష్టాలు



కుకునూర్‌లో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

వేల్పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వరి పంట కోసిన తర్వాత వరికొయ్యల అవ శేషాలు కాల్చడం ద్వారా అపారమైన నష్టాలు ఉంటాయని సుస్థిర కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. వేల్పూర్ మండలం కుకునూర్ గ్రామంలో రైతులకు వరికొయ్యలను కాల్చడం వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు శివసాయి, సీఆర్‌పీ చింత శ్రీనివాస్‌లు మాట్లాడుతూ వరికొయ్యలను కాల్చడం వల్ల నైట్రోజన్, పాస్పరస్, పోటాషియం వంటి పోషకాలు ఆవిరైపోతాయని, భవిష్యత్తులో సాగుచేసే పంట భూమిలో అవి ఉండకుండా పోతాయన్నారు. అంతేకాకుండా కొయ్యల వశేషాలు, కీటకాలు వ్యాధుల నివాసాలుగా మారుతాయని మట్టిలోని సూక్ష్మజీవాలు దెబ్బ తిని భూమి సంతులనం కోల్పోతుందన్నారు. మట్టిలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గి భవిష్యత్తు పంటలకు ఎక్కువగా నీరు అందించే అవకాశం ఏర్పడుతుందన్నారు. దాంతో ఎరువుగా మారి భూసారాన్ని పెంచుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సుస్థిర వ్యవసాయ కేంద్రం శాస్త్రవేత్తలు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లేష్, ఎర్రన్న, దినేష్, శ్రీకాంత్, రమేష్, దశరథ్, గోపి, సురేష్, గ్రామ రైతులు తదితరులు పాల్గొ న్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మెడికల్ ఆఫీసర్

అయోడిన్ ఉప్పును వాడాలి

» సాలూర మండల మెడికల్ ఆఫీసర్ రాజ్ కుమార్

సాలూర, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలకు అయోడిన్ ఉప్పును వాడాలని సాలూర మండల మెడికల్ ఆఫీసర్ రాజ్ కుమార్ సూచించారు. శనివారం సాలూర మండలం ఎంపీయూపీఎస్ పాఠశాల విద్యార్థులకు అయోడిన్ ఉప్పు వాడకం వల్ల చేకూరే ప్రయోజనాలు అదే విధంగా పొగాకు తంబాకు లాంటి అలవాట్లు ఉన్న వారికి ఎలాంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయో అంశాలపై అవగాహన కల్పించారు. పిల్లలు అయోడిన్ ఉప్పును వాడినట్లయితే పిల్లలకు బుద్ధి మందగించకుండా చురుకుగా ఉంటారన్నారు. అదే విధంగా థైరాయిడ్ లాంటి వ్యాధులు సోకకుండా ఉంటుందన్నారు. పొగాకు తంబాకు పూర్తిగా మానివేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రవి రాజు, ఉపాధ్యాయులు శివశంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు రగ్గుల పంపిణీ

మోస్రా, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చందూర్ మండల కేంద్రంలో బాలుర సంక్షేమ వసతి గృహంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 25 మందికి రెడ్‌క్రాస్ సభ్యులు సేకరించిన రగ్గులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తోట రాజశేఖర్ ఏడీఈ, రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ఒక అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ విద్యార్థిని విద్యార్థులను చలి భారీ నుంచి కాపాడడానికి రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు రగ్గులు సేకరించి ఇప్పటి వరకు ప్రభుత్వ వెనుకబడిన బాలుర వసతి గృహాల్లో 900రగ్గులు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ వార్డెన్ చంద్రశేఖర్, స్థానిక విద్యుత్ సిబ్బంది శ్రీనివాస్, ఇలియాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్ని: వర్ని మండల కేంద్రంలోని సీసీడీ ఆవరణలో శనివారం నిరుపేదలకు 300 రగ్గులను పంపిణీ చేశారు. మాదాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలి తీవ్రత దృష్ట్యా ఈ రగ్గులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీసీడీ మేనేజర్ రాగూర్, లయన్స్ నగేష్, సుబ్బారావు, శివరాజు, కనక రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వేంకటేశ్వర స్వామి పల్లకి సేవ

జక్రాన్‌పల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తొర్లికొండ గ్రామంలో శనివారం వేంకటేశ్వర స్వామి దేవాలయం ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారు జామునుంచే భక్తులు కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకీ సేవను కొండపై చుట్టు ప్రదక్షణలు చేయించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల కోసం ఆలయం వద్ద అన్నదాన కా ర్యక్ర మం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ సంజీవ్ గౌడ్, బ్రాహ్మన్‌పల్లి సొసైటీ చైర్మన్ కాటిపల్లి నర్సారెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌పై ప్రజలకు అవగాహన

వేల్పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పడిగెల గ్రామంలో శనివారం ఎన్నికల కోడ్‌పై గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ గంగాధర్‌రావు, నారాయణలు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ. 50 వేలకు మించి నగదు తీసుకెళ్లవద్దని అలా తీసుకెళ్తే ఇబ్బందులు తప్పవని సూచించారు. అలాగే వేలం పాట ద్వారా ఏకగ్రీవం చేస్తే కేసులు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ప్రతీ ఒక్కరు ఎన్నికల కోడ్ అతిక్రమించకుండా ఉండాలని సూచించారు.

నామినేషన్ కేంద్రాల పరిశీలన

కోటగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పోతంగల్, కోటగిరి మండలాల్లో శనివారం నామినేషన్ కేంద్రాలను ఎంపీడీవోలు చందర్, విష్ణులు పరిశీలించారు. సర్పంచ్, వార్డు స్థానాలకు చివరి రోజు కావడంతో నామినేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థులు భారీగా గుమిగూడారు. సర్వర్ మొరాయించడంతో నామినేషన్ల స్వీకరణకు ఆలస్యమైంది. పోటీ చేసే అభ్యర్థులు 5 గంటల లోపు నామినేషన్ కేంద్రాల వద్దకు చేరుకుని తమ పత్రాలను సమర్పించారు. నామినేషన్‌ల స్వీకరణ రాత్రి వరకు కొనసాగింది.

ఆలూర్: మండలంలోని కల్లెడలో గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో గంగాధర్, ఎస్సై రాజ శేఖర్ శనివారం పరిశీలించారు. కేంద్రాల వద్ద ప్రాథమిక సదుపాయాలను, భద్రతా అంశాలు, ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. పోలింగ్ రోజు నిర్వహణలో లోపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు.



కల్లెడలో పోలింగ్ స్టేషన్లో పరిశీలిస్తున్న ఎంపీడీవో గంగాధర్ , ఎస్సై రాజశేఖర్

సర్పంచ్ అభ్యర్థిగా రేఖ నామినేషన్ దాఖలు

నవీపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నవీపేట మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా శనివారం కేఎల్‌వీ రేఖ తమ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీతో ఆమె నామినేషన్ కేంద్రానికి తరలివెళ్లారు. రేఖ భర్త కేఎల్‌వీ రాజేందర్ గౌడ్ గతంలో నవీపేట ఎంపీపీగా పని చేశారు.

ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చట్టాలపై అవగాహన

మోర్తాడ్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలెం గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. వసతి గృహ సంక్షేమ అధికారి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రంజిత్ కుమార్‌లు, పోలీస్ కానిస్టేబుల్ బాలాజీ చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత

ఆర్మూర్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో సత్యనారయణ శనివారం పలువురు బాదితులకు సెల్‌ఫోన్లను అందజేశారు. ఇటీవల స్థానిక స్టేషన్ పరిదిలో పొయినటువంటి సెల్‌ఫోన్లను సిఈఐఆర్ పోర్టల్ ద్వార సేకరించి నాలుగురు బాదితులకు అందజేశారు.

శ్రీనిధి బ్యాంక్ రుణాల రికవరీ వందశాతం ఉండేలా చూడాలి

జిల్లా నాన్‌ఫామ్ డీపీఎం రాచయ్య

కమ్మర్‌పల్లి, నవంబరు 29: (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధి కోసం అందజేస్తున్న శ్రీనిధి, బ్యాంక్ రుణాల రికవరి వందశాతం ఉండేలా చూసుకోవాలని జిల్లా నాన్ ఫామ్ డీపీఎం రాచయ్య అన్నారు. శనివారం మండల ఐకేపీ కార్యాలయంలో మమిసమాఖ్య సం ఘాల సమీక్ష సమావేశంలో ఆసరా పెన్షన్ డీపీఎం రాజేశ్వర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో పెరడికోళ్ల పెంపకం 250 యూనిట్లు ఇదివరకే మంజూరికాగా అర్హులైన వారిని గుర్తించామని వారికి 2 వేల రూపాయల చొప్పు వారిఖతాల్లోకి జమకానున్నాయన్నారు. కాగా మండలంలో ఎస్సీ, ఎస్టీ బీసీలకు మేకల పెంపకం యూని ట్లు మంజూరికాగా ఇందులో ఎస్టీ, బీసీ లబ్దిదారులకు గుర్తించడం జరిగిందని మిగిలిఉన్న ఎస్సీ యూనిట్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బ్యాలెట్ బాక్స్‌ల పరిశీలన

కమ్మర్‌పల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) డిసెంబరు 17న మూడవ విడతలో జరగనున్న కమ్మర్‌పల్లి మండల గ్రామ పంచాయితీల ఎన్నికల నిర్వహన నిమిత్తం ఆధికారులు ఒక్కొక్కటిగా ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో రాజాశ్రీనివాస్ పరిశీలించారు. కాగా ఎన్నికల నిర్వహనలో చేపట్టాల్సిన నియమాలను వివరిస్తూ అవగాహన, శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో భద్రపర్చిన పోలింగ్ సామగ్రిని, బ్యాలెట్ బాక్స్‌ల పనితీరును ఎంపీడివో రాజా శ్రీనివాస్, ఎస్సై అనిల్ రెడ్డితో కలిసి పరిశీలించారు.

అయ్యప్ప ఆలయంలో కుంభాభిషేకం

నవీపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప ఆలయంలో కుంభాభిషేక మహోత్సవం శనివారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా మొదటి రోజైన శనివారం భగవత్ ప్రార్థన, మహ గణపతి పూజ, పుణ్యవచనం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, గోపూజ, ధ్వజారోహణం, నవగ్రహ మండప దేవత కలశ స్థాపన, అగ్నిప్రతిష్ట, లక్ష్మి గణపతి హోమం, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

డీటీఎఫ్ బాల్కొండ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్



ముప్కాల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డీటీఎఫ్ బాల్కొండ ఉమ్మడి మండల అధ్యక్షుడిగా ఒడ్నాల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం బాల్కొండ బాల్కొండలో జిల్లా ప్రెసిడెంట్ ఎం. బాలయ్య ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి ఎస్కే మదర్, ఉపాధ్యక్షురాలు శృతిమ, కార్యదర్శిగా విజయ్ కృష్ణ, జిల్లా కౌన్సిలర్‌గా ఎండీ నుస్రత్ ఎన్నికయ్యారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.శాంతన్, రాష్ట్ర కౌన్సిలర్ పి. విజయ్‌కుమార్, దాసు, పెంటన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నామినేషన్‌ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి


జక్రాన్‌పల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి మండలంలో ఆదివారం నుంచి సర్పంచ్‌లు, వార్డు స్థానాల నామినేషన్‌ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తిచేశామని, 7 క్లస్టరక్లా ఏర్పాటుచేసి నామినేషన్‌లను స్వీకరిస్తామని ఎంపీడీవో సతీష్‌కుమార్, ఎంపీవో యూసుఫ్‌కాన్ శనివారం తెలిపారు. అర్గుల్ క్లస్టర్ పరిధిలో అర్గుల్, నారాయణపేట్, బ్రాహ్మణ్‌పల్లి, కొలిప్యాక్ క్లస్టర్ పరిధిలో కొలిప్యాక్, తొర్లికొండ, మనోహరాబాద్, పడకల్ క్లస్టర్ పరిధిలో పడకల్, చింతలూర్, కలిగోట్, జక్రాన్‌పల్లి క్లస్టర్ పరిధిలో జక్రాన్‌పల్లి, వివేక్‌నగర్ తాండ, చందమియ బానుతాండ, కేశ్‌పల్లి క్లస్టర్ పరిధిలో కేశ్‌పల్లి, బాలనగర్, సికింద్రపూర్, పుప్పాలపల్లి క్లస్టర్ పరిధిలో పుప్పాలపల్లి, మాదాపూర్, గన్యతాండ, మునిపల్లి క్లస్టర్ పరిధిలో మునిపల్లి, నల్లగుట్ట తాండ, లక్ష్మాపూర్ గ్రామాల సర్పంచ్‌లు, వార్డు స్థానాలకు నామినేషన్‌లను స్వీకరిస్తామని సర్పంచ్ స్థానాలకు పోటీచేసే అభ్యర్థులు, వార్డు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు ఈ క్లస్టర్‌ల వారిగా నామినేషన్‌లు వేసుకోవాలని అన్నారు.



వణికించే చలిలో..
పంచాయతీ వేడి

- పొద్దుగాళ్ల నుంచే వీధుల్లో నేతల పర్యటన
- గ్రామాల్లో ఎలక్షన్ల సందడి

పంచాయతీ ఎన్నికల వేళ బరిలో నిలిచే ఆశావహులు పొద్దు పొద్దుగాళ్ల గ్రామంలో ప్రచారానికి కదులుతున్నారు. చలిలో సైతం సర్పంచులు, వార్డు సభ్యులుగా పోటీ చేసేవారు కాలనీ లోకి వెళ్తున్నారు. ఎన్నడూ కనిపించని వారు వారి వారి కాలనీ లలో ప్రత్యక్షం కావడంతో ఎటు వచ్చారు అన్న అంటూ పలకరి స్తున్నారు. అయితే ఓట్లు అడిగే వారు మాత్రం అన్నా బాగున్నారా అంటూ ఇంటి దగ్గరికి వెళ్లి ఓటర్లను పలకరింపులు మొదలయ్యాయి.



అబ్బా.. ఇప్పుడు గుర్తుకు వచ్చామా..

గీ అన్న గిప్పుడు వచ్చిండేంది. అసలు ఇటు ఎందుకు వచ్చినట్లు అని ఒకరినొకరు ముచ్చట్లు పెడ్తున్నరు. అరె ఓట్ల పండుగ గదుల్లో.. గెల్వనీకి ఓట్ల కోసం వస్తున్నరేమో అని మాట్లాడుకుంటున్నరు. ఇగ సదువుకునే పిల్లలతే అమ్మా ఆయనకు మనం ఇప్పుడు గుర్తుకు వచ్చామా అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నరు. ఇగ పోటీచేసేవారేమో ఎవరు ఏమనుకున్నా పర్వాలేదు ఓటేసి ఆదరించండి అంటూ ప్రచారం చేసుకుంటున్నారు.

ఆశపడ్డ వారికి కలిసిరాని రిజర్వేషన్లు

ఎన్నికలలో పోటీ చేస్తామని ముందు చూపుగా ఎంతో మంది సేవా కార్యక్రమాలు చేపట్టారు. సర్పంచి పదవిపై గురిపెట్టి సేవా కార్యక్రమాలు చేసిన వారిని రిజర్వేషన్లు కలిసి రాకపోవడంతో నిరాశకు లోనవుతున్నారు. గణపతులు, దుర్గాదేవి, బతుకమ్మలకు చందాలు ఇచ్చిన నాయకులు రిజర్వేషన్ దెబ్బతో సైలెంట్ అయ్యారు. అయినా ఎంపీటీసీలు, జడ్పీటీసీల రిజర్వేషన్లు కలిసివస్తాయని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఏదేమైనా ఆశల పల్లకీలో ఉన్న నాయకుల భవిష్యత్తు అయినా బాగుంటుందన్న ఆశతో ఉన్నారు. - ఇందూరు, (ఆంధ్రజ్యోతి)

ఏకమయ్యారు.. ఏకగ్రీవం చేశారు


రామకృష్ణ


శాంకిబాయి


అనురాధ

కోటగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్కాస్‌పల్లి సర్పంచ్‌గా రెడ్డి రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అడ్కాస్‌పల్లి నుంచి సర్పంచ్ స్థానానికి ఒకే ఒక నామినేషన్ దాఖలైంది. సర్పంచ్‌గా రామకృష్ణతో పాటు ఆరుగురు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండో పర్యాయం రెడ్డి రామకృష్ణ సర్పంచ్‌గా ఏకగ్రీవం కావడం విశేషం. ఇక ఇదే మండలంలోని రాంపూర్ సర్పంచ్‌గా శాంకిబాయిని గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు తీర్మానించారు. ఎస్టీకి రిజర్వ్ కాగా శాంకిబాయి ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. 8మంది వార్డు సభ్యులు సైతం ఏకగ్రీవం అయ్యారు.

ఎడపల్లి: మండలంలోని బాపూనగర్ సర్పంచ్‌గా నగునూరి అనురాధను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇక్కడ ఎస్సీకి రిజర్వు కాగా అనురాధ ఒక్కరే నామినేషన్ వేశారు. సర్పంచ్‌తో పాటు గ్రామంలోని 8 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవం అయ్యారు. కాగా వీరి ఎన్నికను ఎన్నికల అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది.

రాష్ట్ర సాధనకు పోరాడిన వీరులకు వందనాలు

- బాన్సువాడ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి బాజిరెడ్డి


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి

బాన్సువాడటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తెగించి పోరాడిన వీరులందరికీ వందనాలు చేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. శనివారం దీక్షా దివస్‌లో భాగంగా కొయ్యగుట్ట వద్ద గల అమరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి, స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సాధన కోసం అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారన్నారు. తాను సైతం 1969లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాని తెలిపారు. మలిదశలో తెలంగాణ వాదం మీద పార్టీలు ఏర్పాటుచేసినా అవి ప్రత్యేక తెలంగాణ సాధించలేకపోయాయన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డికి బీఆర్‌ఎస్ అధిక ప్రాధాన్యమిచ్చిందని, ఎక్కడా లేని విధంగా అభివృద్ధికి నిధులు కేటాయించారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అధినేత కేసీఆర్‌ను మోసం చేశారన్నారు. ఇప్పుడు ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుగా ఉండి రైతులకు న్యాయం చేయలేకపోతున్నారని మండిపడ్డారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను ఆయన ఘనంగా సన్మానించారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలోకి చేరికలు


బీజేపీలోకి కండువా కప్పి ఆహ్వానిస్తున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే

పిట్లం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుర్నాపూరం గ్రామంలోని బీఆర్‌ఎస్ నాయకులు శనివారం జుక్కల్ మాజీ ఎమ్మెల్యే అరుణతార సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ మేరకు వారికి మాజీ ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లా డుతూ జుక్కల్ నియోజకవర్గంలో కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జిల్లా ఉపాధ్యక్షుడు రాము, మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, సతీష్ రెడ్డి, మోహన్ రెడ్డి, గోపాల్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి..


కాంగ్రెస్ పార్టీలో చేరిన బీజేపీ నాయకులు

బాన్సువాడటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ నియోజకవర్గంలోని వర్ని మండలం కూనీపూర్‌కు చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు శనివారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో నవీన్ రెడ్డి, సతీష్, దత్తు, మహేందర్‌రెడ్డి, బాలు, ప్రవీణ్ గౌడ్, శేఖర్, నరేశ్ ఉన్నారు.

మండలస్థాయి ఉపన్యాస పోటీలు


మాట్లాడుతున్న హెచ్‌ఎం

మద్నూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇంగ్లిష్ భాషా అభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహించడానికి ఈఎల్‌టీపీ మద్నూర్ ఆధ్వర్యంలో శనివారం జడ్పీహెచ్‌ఎస్‌లో మండల స్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మల్లేశం మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, భాషా నైపుణ్యం, ప్రసంగ సామర్థ్యాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు క్యాదరి రాజేందర్, ఉపాధ్యాయులు శంకరయ్య, నాగయ్య, తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఈఎల్‌టీపీ జిల్లా ప్రతినిధి రచ్చ శివకాంత్, కన్వీనర్ గడ్డివార్ నాగనాథ్, పీఆర్‌టీయూ నాయకుడు భీంరావు పాల్గొన్నారు.

'యూనివర్సిటీలను నిర్లక్ష్యం చేస్తున్నారు'



పీడీఎస్‌యూ మహాసభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ లింబాద్రి

ఆర్మూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ యూనివర్సిటీలను పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్, ప్రొఫెసర్ లింబాద్రి అన్నారు. శనివారం ఆర్మూర్ పట్టణంలో నిర్వహించిన పీడీఎస్‌యూ 23వ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్యవక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యను ప్రోత్సహించడం వల్ల పేద విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ యాజమాన్యాల కోసం ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతులు ఇస్తూ ఉన్నత విద్యను పేద విద్యార్థులకు అందకుండా చేస్తున్నారని విమర్శించారు. సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే బాధ్యత పీడీఎస్‌యూ విద్యార్థుల మీదనే ఉందని ఆయన అన్నారు. శాతవాహన యూనివర్సిటీ, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వినాయక రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొఠారి కమిషన్ సిఫారు ప్రకారం విద్యకు సరిపడా నిధులు కేటాయించకుండా ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. నూతన జాతీయ విద్యవిధానాన్ని తీసుకువచ్చి విద్యను కాషాయకరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు గౌతమ్ కుమార్, ఆహ్వాన సంఘం అధ్యక్ష కార్యదర్శులు పస్క నర్సయ్య, పోచయ్య, మానవ హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి జి.రమేష్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, జిల్లా సహాయ కార్యదర్శి ప్రిన్స్, అరుణోదయ నాయకులు దాసు, అబ్దుల్, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బరిలో ట్రాన్స్‌జెండర్


నామినేషన్ దాఖలు వేసినట్లు పత్రం చూపుతున్న ట్రాన్స్‌జెండర్ అంకిత

నవీపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి శనివారం సాయంత్రం నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో పెద్ద ఎత్తున అభ్యర్థులు నామినేషన్ కేంద్రాలకు తరలివచ్చారు. నవీపేట గ్రామ పంచాయతీ 14వ వార్డు సభ్యురాలిగా గ్రామానికి చెందిన ట్రాన్స్‌జెండర్ కొండపల్లి అంకిత నామినేషన్ దాఖలు చేసింది. 14వ వార్డు ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ అయింది. 2019లో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సైతం అంకిత 14వ వార్డు సభ్యురాలిగా పోటీ చేసి 18 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈ సందర్భంగా అంకిత మాట్లాడుతూ.. తాను వార్డు సభ్యురాలిగా గెలిచిన తర్వాత వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు తాగునీటి వసతి, వీధి లైట్ల ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. గ్రామాభివృద్ధికి సైతం తనవంతు కృషి చేస్తానని వివరించారు.


సంగంలో ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న పరిశీలకులు

అభ్యర్థులు నిబంధనలు పాటించాలి

బోధన్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌గా, వార్డు సభ్యులుగా నామినేషన్ వేసే అభ్యర్థులు తప్పకుండా ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాలని పంచాయతీ ఎన్నికల పరిశీలకులు శ్యాం ప్రసాద్ లాల్ అన్నారు. అనంతరం బోధన్ తహసీల్దార్ విఠల్‌తో కలిసి బోధన్ మండలంలో ఎన్నికలు నిర్వహించే కేంద్రాలను సైతం పరిశీలించారు. బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో మండలంలోని పెంటాకలాన్ గ్రామ పంచాయతీతో పాటు డివిజన్‌లోని పలు గ్రామ పంచాయతీలలో ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. వీరితో పాటు ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.50వేలు దాటితే సీజ్.. తనిఖీలు షురూ


వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

బోధన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని పోలీసు అధికారులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. బోధన్ డివిజన్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికలు మొదటి విడతలో ఉండటంతో ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారు. బోధన్, సాలూర మండలాల అంతర్రాష్ట్ర రహదారిపై ఈ తనిఖీలు చేపట్టారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎక్కువ డబ్బులు తీసుకు వెళ్లవద్దని పోలీసులు చెబుతున్నారు. అత్యవసరం అయితే తప్ప రూ.50 వేలకు మించి డబ్బులు తీసుకువెళ్లవద్దన్నారు. అవసరమైతే వాటికి ఆధారాలు చూపాల్సిన అవసరం ఉందని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. పంచాయతీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల షెడ్యూల్ అమలులోకి వచ్చిన సందర్భంగా రూ.50 వేల వరకే వెంట తీసుకెళ్లేందుకు అనుమతి ఉంటుందన్నారు. అంతకంటే ఎక్కువ డబ్బు ఉండి దానికి సంబంధించిన సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోతే పోలీసులు సీజ్ చేస్తారన్నారు. తక్కువ మొత్తంలో దొరికిన డబ్బులు రెవెన్యూ అధికారుల వద్ద జమ చేస్తారన్నారు. అదే ఎక్కువ ఉంటే ఎన్నికల అధికారులు ఆదాయ పన్ను అధికారులకు సమాచారం అందించి కోర్టులో ఆ డబ్బులు జమ చేస్తారన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నగదు రవాణాపై ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ప్రజలకు పోలీసులు సూచిస్తున్నారు. బస్సుల్లో సైతం పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. ప్రజలు ఎన్నికల కోడ్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైన ఉంది. శనివారం నగదు, మద్యం రవాణా చేయకుండా ఫ్లయింగ్ స్క్వాడ్ కెమెరాలతో తనిఖీలు నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది శ్వేత, కృష్ణ సురేందర్, రూరల్ సీఐ విజయ్‌బాబు పాల్గొన్నారు.


విద్యార్థులకు డెస్క్ బెంచీలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాఠశాలకు డెస్కు బెంచీల వితరణ

బీర్కూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం కిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు బీర్కూర్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి కాజా సునీల్ చౌదరి రూ. 2 లక్షల విలువైన విద్యాసామగ్రిని శనివారం పంపిణీ చేశారు. పాఠశాలకు 18 డెస్క్ బెంచీలు, 100 మంది విద్యార్థులకు బ్యాగులు, క్రీడా దుస్తులు, స్టీల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చదువు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకన్న, ప్రధానోపాధ్యాయులు ప్రసన్నలత, రాధ కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులుకు పరామర్శ

వేల్పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మోతె గ్రామానికి చెందిన రిటైర్డ్ ఐఏఎస్ తొగర్ల చిరంజీవులు మాతృమూర్తి మల్లుబాయి ఇటీవల మృతిచెందింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ లింబాద్రి, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కమిటీ కార్యదర్శి ప్రభాకర్, ఏఐయూకేఎస్ రాష్ట్ర కార్యదర్శి దేవరాం శనివారం పరామర్శించారు. మల్లుబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చిరంజీవులును పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.


మల్లుబాయి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రముఖులు

టీయూలో బీఆర్‌ఎస్వీ నాయకుల ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఇందూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దీక్ష దివస్ కార్యక్రమ నిర్వహణకు అనుమతి ఇవ్వలేదంటూ బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీ పరిపాలన భవనం ముందు శనివారం ధర్నా చేపట్టారు. వర్సిటీ ప్రధా నద్వారం ఎదుట దీక్ష శిబిరానికి సంబంధించిన టెంట్లు, మైక్‌లు తీసివేయడంతో ఆందోళనకు దిగా రు. ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రాజారాం యాదవ్ మాట్లాడుతూ.. కేసీఆర్ దీక్షదివస్ కార్యక్రమం శాంతియుతంగా జరుపుతుంటే మొదట అనుమతి ఇచ్చి తర్వాత నిరాకరించడం వెనక కాంగ్రెస్ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. డిసెంబరు 9 తర్వాత ప్రకటన లేకుంటే తెలంగాణ ఏర్పాటు అయ్యేదికాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతటి నిర్బంధాలు విధించిన విద్యార్థులు, నిరుద్యోగులు ప్రజల పక్షాన పోరాటం సాగిస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సంతోష్, నాగేంద్ర, నిరంజన్, లింగం యాదవ్, అశోక్ పటేల్, జక్కుల రాజేందర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా కార్యక్రమం


శుభ్రం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

ఇందూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం నగరంలోని కూరగాయల మార్కెట్‌లో స్వచ్ఛతా మాస్ క్లీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటామన్నారు. గంజ్ మార్కెట్‌లో వాలంటీర్లు అధిక సంఖ్యలో పాల్గొని ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త అపర్ణ, జీజీ కళాశాల, సాంఘీక సంక్షేమ కళాశాల, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, ప్రోగ్రాం అధికారులు సురేష్, వెంకట్‌రమణ, సుధాకర్, నాగజ్యోతి, నరేష్, రజిత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి


స్వాగతం పలుకుతున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

నాగిరెడ్డిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొడక్షన్ కౌన్సిల్ చైర్మన్ నవోదయ సిద్ధార్థ అన్నారు. సంస్థ సభ్యులతో కలిసి శనివారం మండల కేంద్రంలోని కేరళ టాలెంట్ స్కూల్‌ను సందర్శించారు. విద్యాబోధనను పరిశీలించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే చదువు పైన దృష్టి సారించాలన్నారు. ప్రిన్సిపాల్ నిర్మల జిమ్మీ, సంస్థ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్ రావు, జిల్లా అధ్యక్షులు బోరంచ సాయిలు, బాబురావు, వికాస్ ,ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెండో విడత నామినేషన్లు


నాగిరెడ్డిపేట ఎంపీడీవో కార్యాలయం

నాగిరెడ్డిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 27 గ్రామాలకు సంబంధించి సర్పంచ్, వార్డుస్థానాలకు రెండో విడత ఎన్నికలు జరగనున్నాయి. అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. రెండో వి డతలో జరగనున్న ఎన్నికలకు సంబంధించి మండలంలో ఈనెల 30 (ఆదివారం) నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. ఈ నెల 30 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు నామినేషన్ల స్వీకరణ జరగనుంది. మండలంలో 27 గ్రామ పంచాయతీలుండగా.. 27 సర్పంచ్ స్థానాలకు, 232 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించేందుకు మండలంలో ఎనిమిది నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో లలిత కుమారి తెలిపారు. నాగిరెడ్డిపేట ఎంపీడీవో కార్యాలయంలో, నాగిరెడ్డిపేట ఈ- పంచాయితీ కార్యాలయంలో, ఆత్మకూర్, బొల్లారం, ధర్మారెడ్డి, నాగిరెడ్డిపేట, మాల్తుమ్మెద, తాండూర్ గ్రామాల్లోని గ్రామ పంచాయితీల కార్యాలయ భవనాల్లో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఆయా కేంద్రాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. మండలంలో 25,863 మంది ఓటర్లు ఉండగా అందులో 12,032 మంది పురుషులు, 13,831 మహిళా ఓటర్లు ఉన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు


వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

మద్నూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మండలానికి సరిహద్దులో మహారాష్ట్ర నుంచి వస్తున్న వాహనాలను అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో మండలానికి సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. రెవెన్యూ పోలీసులు మహారాష్ట్ర నుంచి మద్యం అక్రమంగా డబ్బు రాష్ట్రంలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. శనివారం సరిహద్దులోని చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారి సంగమేశ్వర్, ఏఎస్ఐ ప్రభాకర్, సిబ్బంది యాదగిరి వాహనాలను తనిఖీ చేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కోటగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ హెచ్చరించారు. పోతంగల్ మండల కేంద్రంలోని నామినేషన్ కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు. ఎన్నికల వేళ సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వాక్యలు చేసినా, అనవసరమైన ప్రచారాలు చేసినా చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట రుద్రూర్ సీఐ కృష్ణ, కోటగిరి ఎస్ఐ సునీల్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్

యువ పర్వతారోహకుడికి ఎస్పీ అభినందన



యశ్వంత్‌ను అభినందిస్తున్న ఎస్పీ

కామారెడ్డిటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణకు చెందిన యువ పర్వతారోహకుడు భూక్యయశ్వంత్‌ని ఎస్పీ రాజేష్‌చంద్ర అభినందించారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో యశ్వంత్ అధిరోహించిన పర్వతాల వివరాలను వెల్లడించి ఎస్పీకి అందించారు. అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ఎతైన శిఖరం మౌంట్ గోరిచెన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ఎతైన శిఖరం మౌంట్‌రియో పూర్గిల్, అస్సాం, మణిపూర్, మిజోరాం రాష్ట్రాలలో ఎతైన శిఖరాలను విజయవంతంగా అధిరోహించడం అభినందించదగిన విషయమన్నారు. యువతకు ప్రేరణగా నిలిచే ఈ విజయాలు అత్యంత ప్రశంసనీయమైనవని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



దేవునిపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

కామారెడ్డి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రైలు ప్రమాదంలో మృతిచెందిన సుధాకర్ కుటుంబాన్ని మాజీఎమ్మెల్యే గంపగోవర్దన్ పరామర్శించారు. దాదాపు 100 వరకు గొర్రెలు మృతిచెందడం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ధైర్యంగా ఉండాలని కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్లు కృష్ణాజిరావు, కాసర్ల స్వామి, శశిధర్‌రావు, జూకంటి ప్రభాకర్, గైని శ్రీనివాస్‌గౌడ్, రాజేందర్, గంగాధర్, బాలకిషన్, రాజలింగం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన చెన్నాపూర్ గ్రామస్థులు



మదన్‌మోహన్‌ను కలిసిన చెన్నాపూర్ గ్రామస్థులు

గాంధారి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గాంధారి మండలంలోని కొన్ని గ్రామాలు, తండాలు ఏకగ్రీవం వైపు చూస్తున్నాయి. మండలంలోని చెన్నాపూర్ గ్రామంలో గ్రామస్థులు ఏకతాటిపై ఉండే సర్పంచ్ అభ్యర్థిగా గ్రామానికి చెందిన నాగయ్యను గ్రామస్థులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అనంతరం ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును కలిసి సన్మానించారు. మండలంలోని నేరేల్‌తండా, గొల్లాడి తండా గ్రామాలు ఇప్పటికే ఏకగ్రీవ సర్పంచ్‌లుగా తీర్మానం చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పరమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సింగసాని శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్న నాయకులు

రాజంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాయిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త కమలవ్వ అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందింది. ఈ విషయం మండల నాయకులు మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్‌కు తెలుపగా మృతురాలి అంత్యక్రియలకు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ డబ్బులను రైతు బంధు మండల కన్వీనర్ జూకంటి మోహన్ రెడ్డి బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో భాస్కర్, నర్సింలు, సిద్దవ్వ, సిద్దిరాములు, లింగం, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

పాల్కంపేటలో కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి చేరిక



బీజేపీలోకి చేర్చుకుంటున్న
జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజు

లింగంపేట, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొల్కంపేటకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు క్రాంతికుమార్ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలంచిన్న రాజులు సమక్షంలో బీజేపీలోకి చేరారు. సర్పంచ్ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీకి చెందిన మేకమల్లేష్, మంగళి నరేష్, తలారి రాజు, తలారి నాగరాజు, బొల్లారం అంజి, వెంకటి, మహంకాళి రాజులతో పాటు మరికొంత మంది కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలోకి చేరారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మాయచేస్తుందని, మోడీ చేస్తున్న అభివృద్ధిని చూసి బీజేపీలోకి చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు క్రాంతికుమార్, రాష్ట్ర నాయకులు బాణాల లక్ష్మారెడ్డి, ఎల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి రవీందర్‌రావు, మాజీ మంత్రి నేరేళ్ల ఆంజనేయులు, అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్, రాజమోహన్‌రెడ్డి, రజనీకాంత్, విష్ణువర్దన్‌లతో పాటు నాయకులున్నారు.

సమాజ మార్పు కోసం ఉద్యమించాలి

కామారెడ్డి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు సమాజ మార్పుకోసం విద్యార్థులు ఉద్యమించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్రనాయకుడు ప్రభాకర్ అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో పీడీఎస్‌యూ జిల్లా మహాసభల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు శ్రమజీవులుగా అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. చైతన్యమైన విద్యార్థులుగా రైతులు, కూలీలు, కార్మికులుగా ఉన్న ప్రజలను సమీకరించి బలమైన విప్లవోద్యమాలను నిర్మించాల్సిన బాధ్యతను తీసుకోవాలని కోరారు. దోపిడీ వర్గాలు, కార్పొరేట్ కంపెనీలు ప్రజలు అన్ని విధాలుగా వంచించి దోపిడీ చేస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసమస్యలను గాలికి వదిలేసి నిమ్మకు నీరేత్తినట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి అనిల్, రాష్ట్ర నాయకుడు రామకృష్ణ, దేవరాం, రమేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవాలపై నాయకుల దృష్టి

(5వ పేజీ తరువాయి)

కూడా విడుదల చేయలేదు. 2024 ఫిబ్రవరి పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన నడుస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో గ్రామాలకు పైసా విడుదల కాలేదు. గ్రామాల్లో అత్యవసర పనులకు పంచాయతీ కార్యదర్శులే అప్పులు చేసి పెట్టుబడులు పెడుతున్నారు. ఇప్పుడు ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు నజరాన ప్రకటించినా అవి కూడా అందుతాయో లేదోనని ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఏకగ్రీవాలపై దృష్టి పెట్టిన ఎమ్మెల్యేలు

జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లో ఆయా గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలను ఏకగ్రీవం చేసేందుకు స్థానిక ఎమ్మెల్యేలు దృష్టి సారించారు. రానున్న రోజుల్లో క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ తమ బలాన్ని పెంచుకునేందుకు పంచాయతీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుంది. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లుగా పోటీచేసి గెలిచే తమ మద్దతుదారులను బరిలో దిం పేలా చూస్తోంది. ఏకగ్రీవమయ్యే పం చాయతీల్లో ఇతరులు పోటీ లేకుండా స్థానిక ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు చక్రం తిప్పుతున్నారు. ఏకగ్రీవమయ్యే పంచాయతీల్లో ఇతరులు పోటీ లేకుం డా బుజ్జగింపులు చేస్తున్నారు. మొదటి విడతలో కామారెడ్డి నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో, ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని సదాశివనగర్, తాడ్వాయి, రామారెడ్డి, రాజంపేట మం డలాలు ఉండడంతో ఆయా గ్రామాల్లో వీలైన కాడికి పంచాయతీలను ఏకగ్రీవం చేసి పోటీ లేకుండా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావులు చర్చలు జరుపుతున్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో మాచారెడ్డి మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీ అయిన ఎల్లంపేట, అక్కింరెడ్డిపల్లి తండా, బోడగుట్ట తండా, వెనుక తండా సింగల్ నామినేషన్లు దాఖలయ్యాయి. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో తొమ్మిది పంచాయతీల్లో సింగిల్ నామినేషన్లు దాఖలైనట్లు తెలిసింది. ఈ పంచాయతీలు దాదాపు ఏకగ్రీవాలు అయ్యే అవకాశం ఉంది.

నేడు రెండోవిడత నోటిఫికేషన్

మూడు విడతల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రెండో విడత నోటిఫికేషన్ జిల్లా ఎన్నికల అధికారి ఆదివారం జారీ చేయనున్నారు. ఆ రోజు నుంచి రెండో విడతలోని సర్పంచ్, వార్డుస్థానాలకు నామినేషన్లు స్వీకరిస్తారు. రెండో విడతలో ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని నాలుగు మండలాలైన లింగంపేట, నాగిరెడ్డిపేట్, గాంధారి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌లోని మూడు మండలాలైన నిజాంసాగర్, మహ్మద్‌నగర్, పిట్లం మండలాల్లో గల 197 సర్పంచ్, 1,654 వార్డు స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుంది. రెండో విడత నామినేషన్ల చివరి తేదీ డిసెంబరు 2న ముగియనుంది.

ముగిసిన మొదటివిడత నామినేషన్లు

పంచాయతీ ఎన్నికల ప్రక్రియ జిల్లాలో కొనసాగుతోంది. జిల్లాలో 532 గ్రామ పంచాయతీ, 4,656 వార్డుస్థానాలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి విడతలో భాగంగా కామారెడ్డి డివిజన్‌లోని 10 మండలాల్లో 167 సర్పంచ్ స్థానాలకు, 1,520 వార్డు మెంబర్ల స్థానాలకు మూడు రోజులుగా నామినేషన్లు స్వీకరించారు. శనివారంతో మొదటివిడత నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. 167 సర్పంచ్ స్థానాలకు 1292 నామినేషన్లు రాగా 1,520 వార్డు మెంబర్ల స్థానాలకు 3802 నామినేషన్లు వచ్చాయి. నేడు రేపు నామినేషన్ల పరిశీలన చేయనున్నారు. డిసెంబరు 3న విత్‌డ్రాలు, పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను ఎన్నికల అధికారులు ప్రకటిస్తారు.

మొదటి విడతలో దాఖలైన నామినేషన్లు ఇలా..

మండలం	సర్పంచ్ స్థానాలు	వచ్చిన నామినేషన్లు	వార్డు స్థానాలు	నామినేషన్లు
భిక్కనూరు	18	156	182	636
బీబీపేట్	11	70	110	275
దోమకొండ	09	74	96	315
కామారెడ్డి	14	121	120	368
మాచారెడ్డి	25	211	196	435
పాల్వంచ	12	75	110	270
రాజంపేట్	18	132	158	367
రామారెడ్డి	18	136	166	362
సదాశివనగర్	24	206	214	426
తాడ్వాయి	18	111	168	348

కాంగ్రెస్ మద్దతుదారులే ఏకగ్రీవం

(5వ పేజీ తరువాయి)

రుణమాఫీ, రైతు భరోస అందించిందని తెలిపారు. యాసంగిలోనూ రైతు భరోస అందించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు నియోజకవర్గంలో 3,600 మంజూరు కాగా 3 వేల ఇళ్ల నిర్మాణం సాగుతుందని, మరో 600ల ఇళ్లు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు రాని వారికి రెండవ విడతలో ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వైద్యం పరంగా మెడికల్ కళాశాల నిర్మాణానికి అవసరమైన రూ.26 కోట్ల నిధులు మంజూరు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహను కోరామని తెలిపారు. అదే విధంగా దోమకొండలో 50 పడకల ఆస్పత్రి మంజూరైందని లాండ్ మాత్రం చూపడం లేదని, అది కూడా త్వరలోనే పరిష్కారం అయ్యేలా చూస్తామని తెలిపారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలో రూ.9కోట్లతో ఇండోర్ స్టేడియం, రూ.9.5 కోట్లతో సీసీ రోడ్లు, అమృత్ స్కీమ్‌లో నీటి ట్యాంకులు, పైపులైళ్ల పనులు త్వరగా జరిగేలా చూసి ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. కామారెడ్డిలో రెండు రోజుల కిందట కవిత పర్యటన సందర్భంగా షబ్బీర్ అలీ మంత్రులను, ఎంపీలను తీసుకువస్తున్నాడని నిధులు మాత్రం తీసుకురావడం లేదని తెలిపిందని మరి తాను ఎమ్మెల్సీగా ఉండి కామారెడ్డి అభివృద్ధికి ఎన్ని నిధులు తీసుకువచ్చిందని తెలిపారు. ఎమ్మెల్సీ కవితతో పాటు స్థానిక ఎమ్మెల్యే కలిసి వస్తే అభివృద్ధిని చేసుకుందామని తెలిపారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, కామారెడ్డి మండల అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి, గోనే శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నాయకుడు సందీప్, చిన్నమల్లారెడ్డి రాజాగౌడ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కిక్కు

(5వ పేజీ తరువాయి)

కొత్త వైన్స్‌లు ప్రారంభం కానున్నాయి. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే నోటిఫికేషన్ వెలువడింది. జిల్లాలో మొత్తం 532 గ్రామ పంచాయతీలకు, 4,656 వార్డు స్థానాలకు మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. డిసెంబరు 17 తేది వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగనుండగా మద్యం విచ్చలవిడిగా పంపిణీ జరిగే అవకాశం ఉంది. నామినేషన్ల ప్రక్రియ నుంచి మొలుకొని ఎన్నికల ఫలితాల వరకు నిత్యం పల్లెల్లో పండుగే ఉంటుంది.

కొత్త లిక్కర్ వ్యాపారుల్లో జోష్

జిల్లాలో లిక్కర్ షాపులు దక్కించుకోవడానికి సిండికేట్ వ్యాపారులు తక్కువగానే దరఖాస్తులు చేశారు. ఒక్కో దరఖాస్తుకు రూ.3లక్షల చొప్పున లక్షలాది రూపాయలు వెచ్చించారు. కొన్ని సిండికేట్లకు ఒక్క షాప్ కూడా దక్కకపోగా మరికొంత మందికి 2,3 షాపులు లాటరీల్లో తగిలాయి. కాగా షాపులు దక్కించుకున్న వారికి మొదట్లోనే ఎన్నికలు తగలడంతో వ్యాపారుల్లో ఉత్కంఠ వ్యక్తమవుతోంది. సాధారణంగా మధ్య తరగతి వైన్స్ షాపుల్లో నెలకు సుమారు రూ.2కోట్ల వరకు లిక్కర్ అమ్మకాలు జరుగుతాయి. కానీ ఎన్నికల వేల సుమారు రూ.5కోట్ల వరకు అమ్మకాలు జరిగే అవకాశం ఉంది. సోమవారం నుంచి కొత్త వైన్స్ షాపులు ప్రారంభం కానున్న నేపథ్యంలో యజమానులు షాపులు ఏర్పాటు చేసేందుకు మడిగెలను కిరాయి తీసుకున్నారు. కౌంటర్లు, బాటిల్ కూలర్లు ఇతర సామగ్రిని సిద్ధం చేసుకొని ఎదురు చూస్తున్నారు. పాత యజమానులు కూడా గడిచిన మూడు రోజుల్లో పెద్ద ఎత్తున మద్యం కొనుగోలు చేసి ఎన్నికల వేల బ్లాక్‌లో అమ్ముకోవడానికి సిద్ధం చేసుకున్నారని సమాచారం. ఎక్సైజ్ అధికారులు దృష్టి సారిస్తే అక్రమ మద్యం అమ్మకాలు అరికట్టే అవకాశం ఉంటుంది.

ఎన్నికల నియమావళిని పాటించాలి : ఏఎస్పీ చైతన్య రెడ్డి

రామారెడ్డి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని ఏఎస్పీ చైతన్యరెడ్డి అన్నారు. శనివారం రామారెడ్డి మండల కేంద్రంతో పాటు రెడ్డిపేట్ గ్రామంలో నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. నామినేషన్ దాఖలుకు సంబంధించి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుదారులతో పాటు ఇద్దరికి మాత్రమే లోనికి అనుమతించాలని సిబ్బందికి సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏఎస్పీ

పోటాపోటీగా నామినేషన్లు

దోమకొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని 9 గ్రామాలకు సంబంధించి సర్పంచ్ అభ్యర్థులుగా 74 మంది నామినేషన్‌లు వేసినట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ శనివారం తెలిపారు. అంబార్‌పేట సర్పంచ్ అభ్యర్థులుగా 7, సీతారాంపల్లి 3, సంగమేశ్వర్ 8, లింగుపల్లి 7, గొట్టిముక్కుల 8, అంచనూర్ 8, ముత్యంపేట 10, చింతమాన్‌పల్లి 7, దోమకొండ 16 మొత్తం మండలంలో 74 మంది నామినేషన్‌లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

మొత్తం వార్డు నామినేషన్‌లు 315

దోమకొండ మండలంలోని 9 గ్రామాలకు సంబంధించి వార్డులకు మొత్తం 315 నామినేషన్‌లు వచ్చినట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ శనివారం తెలిపారు. అంబార్‌పేటలో 12 వార్డులకుగాను 49 నామినేషన్‌లు,సీతారాంపల్లి 8 వార్డులకు 18, సంగమేశ్వర్ 12 వార్డులకు 29, లింగుపల్లి 8 వార్డులకు 13, గొట్టిముక్కుల 8 వార్డులకు 19, అంచనూర్ 10 వార్డులకు 21, ముత్యంపేట 12 వార్డులకు 42, చింతమాన్‌పల్లి 10 వార్డులకు 25, దోమకొండ 16 వార్డులకు 99 మండలంలో మొత్తం 315 నామినేషన్‌లు వచ్చినట్లు ఆయన తెలిపారు. బీబీపేట మండలంలోని 11 గ్రామాలకు సంబంధించి సర్పంచ్ అభ్యర్థులుగా 70 మంది నామినేషన్‌లు వేసినట్లు ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ శనివారం తెలిపారు. బీబీపేటలో 10, ఇస్సానగర్ 5, ఉప్పర్‌పల్లి 4, మాల్కాపూర్ 7, శేరీబీబీపేట 5, తుజాల్‌పూర్ 7, కోనాపూర్ 10, శివర్‌రాంరెడ్డి పల్లి 1, యాడారం 4, మందాపూర్ 11, జనగామ 6 మొత్తం మండలంలో 70 నామినేషన్‌లు వచ్చినట్లు ఆయన తెలిపారు. బీబీపేటలో 14 వార్డులకు 49 నామినేషన్‌లు, ఇస్సానగర్ 10 వార్డులకు 33, ఉప్పర్‌పల్లి 10 వార్డులకు 17, మాల్కాపూర్ 10 వార్డులు 29, శేరీబీబీపేట 8 వార్డులకు 19, తుజాల్‌పూర్ 10 వార్డులకు 27, కోనాపూర్ 8 వార్డులు 11 నామినేషన్‌లు, శివర్‌రాంరెడ్డిపల్లి 8 వార్డులకు 8, యాడారం 10 వార్డులకు 21, మాందాపూర్ 12 వార్డులకు 34, జనగామ 10 వార్డులు 27,మొత్తం మండలంలో 110 వార్డులకు 275 నామినేషన్‌లు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు.

సదాశివనగర్ : గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా సదాశివనగర్ మండలంలో నామినేషన్లు పోటాపోటీగా కొనసాగాయి. రిజర్వేషన్ల ప్రకారం అభ్యర్థులు నామినేషన్లు వేయగా జనరల్ స్థానాల్లో మహిళలు కూడా నామినేషన్లు వేశారు. వజ్జపల్లి తండా సర్పంచ్ అభ్యర్థిగా సంధ్య కుటుంబసభ్యులతో కలిసి నామినేషన్ వేశారు.



వజ్జపల్లి తండా సర్పంచ్ అభ్యర్థిగా
నామినేషన్ వేస్తున్న సంధ్య

నేటి నుంచి నామినేషన్లు

లింగంపేట, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సర్పంచ్ ఎన్నికలు రెండోవిడతలో ఆదివారం నుంచి స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో నరేష్ తెలిపారు. మొత్తం 41 గ్రామ పంచాయతీలకు నామినేషన్లు స్వీకరించేందుకు మొత్తం 12 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. శనివారం ఆర్‌వోలు, ఏఆర్‌వోలతో నిర్వహించిన సమావేశంలో నామినేషన్ల స్వీకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. ఆదివారం నుంచి డిసెంబర్ 2 వరకు నామినేషన్ల స్వీకరణ, డిసెంబర్ 3న స్క్రూట్నీ, డిసెంబర్ 4న అప్పీల్, డిసెంబర్ 5న డిస్పోజల్, డిసెంబర్ 6న విత్‌డ్రాల్, పోటీచేసే వారి వివరాలు, గుర్తుల కేటాయింపు డిసెంబర్ 14న పోలింగ్, అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.



లింగంపేట ఎంపీడీవో కార్యాలయంలో
సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70 - ఆంధ్రా కింగ్ తాలూకా
ప్రియ 35 - రాజు వెడ్స్ రాంబాయి
దర్శన్ - జటాదర

బాన్సువాడ

మహేశ్వరి - రాజువెడ్స్ రాంబాయి
వెంకటేశ్వర - ఆంధ్రా కింగ్ తాలూకా

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230

చిన్నమల్లారెడ్డి నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



చిన్నమల్లారెడ్డిలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కామారెడ్డి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమల్లారెడ్డి నామినేషన్ కేంద్రాన్ని శనివారం కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్ పరిశీలించారు. ఈ నెల 27 నుంచి ప్రారంభమైన నామినేషన్ ప్రక్రియ శనివారంతో ముగిసిందని తెలిపారు. ఆదివారం స్క్రూట్నీ నిర్వహించామన్నారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్, వార్డు స్థానాలకు నిర్వహిస్తున్న ఎన్నికల్లో ఎలాంటి తప్పిదాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించి అవసరమైన వారికి సహాయ సహకారాలు అందించాలన్నారు. ఎన్నికల నియమావళిని తప్పకుండా అమలయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, డీఎల్‌పీవో శ్రీనివాస్, తహసీల్దార్ జనార్ధన్ పాల్గొన్నారు.

ఐదు పంచాయతీలు ఏకగ్రీవం

లింగంపేట, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఆదివారం నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభం కానుండగా శనివారం నాటికే మండలంలోని ఐదు పంచాయతీలలో ఏకగ్రీవంగా సర్పంచ్‌లను ఎన్నుకునేందుకు గ్రామస్తులు తీర్మానం చేసుకున్నారు. ప్రభుత్వం ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగిన పంచాయతీలకు రూ.30 లక్షలు ఇస్తామని ప్రకటించడంతో గ్రామాలలో ఏకగ్రీవంగా ఎన్నికలు నిర్వహించేందుకు గ్రామపెద్దల సమక్షంలో నిర్ణయాలు తీసుకుంటున్నారు. మండలంలోని నల్లమడుగుతండా, రాంపల్లి, రాంపల్లితండా, మెంగారం, బాణాపూర్‌తండాలలో సర్పంచ్‌లతో పాటు వార్డుసభ్యుల ఎన్నిక ఏకగ్రీవాలు జరిగినట్లు తెలిసింది. డిసెంబర్ 2వరకు నామినేషన్లు వేసేందుకు అవకాశం ఉండడంతో అప్పటి వరకు మండలంలో పలు గ్రామపంచాయతీలను ఏకగ్రీవం చేసేందుకు గ్రామాల్లో పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నారు.

కబడ్డీ ఎంపికలు



ఇందిరాగాంధీ స్టేడియంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కామారెడ్డిటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): 51వ బాలుర, బాలికల అండర్ -20 కబడ్డీ ఎంపికలను శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించారు. ఈ ఎంపికలలో బాలుర విభాగం నుంచి 14, బాలికల విభాగం నుంచి 14 మంది ఎంపికైనట్లు కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాణాల భాస్కర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడశాఖాధికారి వెంకటేశ్వర్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, విజయలక్ష్మీ, రేణుక, అరుణ, సబితా, వెంకట్, అనిల్, లక్ష్మన్, నరేష్ రెడ్డి, అనిల్, నవీన్, లక్ష్మన్‌రాథోడ్ పాల్గొన్నారు.

ఎన్నికలు బహిష్కరిస్తే అభివృద్ధి కుంటుపడుతోంది



మల్లుపేట్ గ్రామస్తులతో
మాట్లాడుతున్న ఎంపీడీవో

సదాశివనగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు బహిష్కరిస్తే గ్రామాభివృద్ధి కుంటుపడుతుందని ఎంపీడీవో సంతోష్‌కుమార్ అన్నారు. మండలంలోని మల్లుపేట్ గ్రామస్థులు తమ సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదనే ఆవేదనతో ఎన్నికలు బహిష్కరిస్తూ చివరిరోజు మధ్యాహ్నం వరకు ఒక్కరూ నామినేషన్ వేయలేదు. మల్లుపేట్ నుంచి మోడిగాం వరకు బీటీ రోడ్డు, మల్లుపేట గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా ప్రకటించడం డిమాండ్‌లు ఉన్నాయన్నారు. జాతీయరహదారి వద్ద బ్రిడ్జి నిర్మాణం లాంటి ఎన్నో సమస్యలను అధికారులకు లిఖితపూర్వకంగా విన్నవించినా సమస్యలు తీరడం లేదని అందుకే ఎన్నికలను బహిష్కరించామన్నారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎస్సై పుష్పరాజ్ గ్రామానికి చేరుకుని గ్రామస్థులతో చర్చించారు. ఎన్నికల్లో పాల్గొంటేనే ప్రభుత్వం నుంచి నిధులు వస్తాయని నచ్చజెప్పడంతో పోటీకి ముందుకు వచ్చారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

బాన్సువాడ రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని కృష్ణనగర్ తండా సమీపంలో గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శనివారం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అక్రమంగా డబ్బులు, మద్యం తరలించినట్లైతే కేసులునమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సాయిలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నికలకు సంబంధించి 8 నామినేషన్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎంపీడీవో తాహెరాబేగం శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలకు, 246 వార్డు స్థానాలకు సంబంధించి నామినేషన్లు స్వీకరించడానికి 8 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు.

అధికారులు, అభ్యర్థుల బిజీ బీజీ

రామారెడ్డి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా అధికారులు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. శనివారం నామినేషన్లకు చివరిరోజు కావడంతో సర్పంచ్, వార్డుస్థానాల అభ్యర్థులు పెద్దఎత్తున నామినేషన్ కేంద్రాల వద్ద బారులు తీరారు. మూడు రోజులుగా రామారెడ్డి మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు సంబంధించి 12 చోట్ల నామినేషన్లను స్వీకరించారు. శనివారం సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ దరఖాస్తులను స్వీకరించారు. రామారెడ్డి, రెడ్డిపేట్ కేంద్రాల వద్ద ప్రజలు అధిక సంఖ్యలో బారులు తీరారు. దీంతో కార్యాలయాల్లో సాయంత్రం 5 గంటల వరకు అధికారులు నామినేషన్ల ప్రక్రియలో ఉండిపోయారు.